క్లుప్తంగా

నీటి తొట్ల నిర్మాణాలకు భూమిపూజ



నీటి తొట్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

సి.బెళగల్: పశువులకు దాహం తీర్చేందుకు నీటి తొట్ల నిర్మాణాలకు అధికారులు మంగళవారం భూమి పూజ చేపట్టారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.33,220తో మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు, పోలకల్, చింతమానుపల్లె, ఇనగండ్ల, ఈర్లదిన్నె, బ్రాహ్మణదొడ్డి, కొత్తకోట గ్రామాల్లో పశువులకు కమ్యూనిటీ నీటి తొట్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరైనట్లు ఏపీఓ లక్ష్మన్న తెలిపారు. సి.బెళగల్‌లోని ఎమ్మిగనూరు – గూడూరు ప్రధాన రోడ్డుపై నీటితొట్టి నిర్మిస్తున్నారు. భూమి పూజలో ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఎంఈఓ జ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, సర్పంచ్ పాండురంగన్న, టీఏలు రామ్‌శంకర్, మురళీ, ఎఫ్ఏ హబీబ్, రైతులు పాల్గొన్నారు. పోలకల్‌లో ఈసీ రంగస్వామి, టీఏ గోవర్ధన్ స్థానికులతో కలిసి నీటి తొట్టి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



కోడుమూరులో పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిరసన తెల్పుతున్న క్రైస్తవ సంఘాలు

కోడుమూరు రూరల్: రాజమండ్రి సమీపంలో పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలంటూ మంగళవారం కోడుమూరులో దళిత, క్రైస్తవ సంఘాల సభ్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత, క్రైస్తవ సంఘాల పెద్దలు ఆంధ్రయ్య, రెవరెండ్ సామెల్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి ప్రమాదమా? హత్యనా అనే విషయాలపై ప్రజలకు అనుమానులున్నాయన్నారు. పోలీస్ యంత్రాంగం కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి ప్రవీణ్ మృతిపై గల అనుమానాలను నివృత్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత, క్రైస్తవ సంఘం పెద్దలు మహిమాకర్, యోహాన్, రాజ్‌కుమార్, నాగేష్, క్రైస్తవులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 17వ వార్డులో రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా రోటరీ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

నేటి నుంచి హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు

పాణ్యం: ఎస్. కొట్టాల గ్రామంలో వెలసిన హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు బుధవారం నుంచి ప్రారంభం కానుంది. 2వ తేదీన గంధం సమర్పణ, 03న ఉరుసు నిర్వహించనున్నారు. ఉరుసులో భాగంగా గుండు పందెం, రాష్ట్ర స్థాయి మహిళా ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. 4న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: గోరుకల్లు– దుర్వేశి రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. నంద్యాల పట్టణానికి చెందిన సలీమ్ కుటుంబ సభ్యులతో గోరుకల్లు జలాశయం వద్దకు వచ్చారు. సలీమ్ ఒక్కడే బైక్‌పై నంద్యాలకు తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే దుర్వేశి మెట్ట వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం ఉంచిన సిమెంట్ పైపులను తప్పించిబోయిన సలీమ్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాలకు స్థానికులు కారులో తరలించారు.

పౌర సరఫరాలు, విజిలెన్స్ అధికారుల దాడులు



53వ రేషన్ షాపును సీజ్ చేస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): బియ్యం అక్రమ రవాణాపై పౌర సరఫరాలు, విజిలెన్స్ అధికారులు నిఘా ఉంచారు. మంగళవారం కర్నూలు అర్బన్ పరిధిలోని పలు ఎఫ్‌పీ షాపులు, ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. కొత్తపేటలోని ఎఫ్‌పీ షాప్ నంబర్ 53ను సీజ్ చేశారు. అధికారులు దాడులకు వస్తున్నట్లు ముందుగా తెలుసుకున్న డీలర్ తాళం వేసి పరారయ్యారు. దీంతో అధికారులు షాపును సీజ్ చేశారు. అలాగే ఎండీయూ వాహనం 62ను తనిఖీ చేయగా, 246 కిలోల బియ్యం, 82 చక్కెర ప్యాకెట్లు తక్కువగా ఉండడంతో ఆపరేటర్ పి.మహేష్‌పై చర్యలు తీసుకోవాలని కర్నూలు ఆర్డీఓకు నివేదించినట్లు డీఎస్ఓ ఎం.రాజారఘువీర్ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఓ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖరరెడ్డి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఆటిజం.. పిల్లల్లో అదో రకం!

- ఆలోచన తక్కువ.. ఆవేశం ఎక్కువ
- పుట్టుకతో వచ్చే అరుదైన వ్యాధి
- త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే మేలు
- ఆలస్యంగా గుర్తిస్తే జీవితాంతం చిన్నపిల్లలే...!
- నేడు జాతీయ ఆటిజం దినం



డైస్‌లో చిన్నారులకు చికిత్స చేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): పిల్లలు పెద్దయ్యేకొద్దీ వారిలో సహజమైన మార్పులు కనిపిస్తాయి. వయస్సుకు తగ్గట్లు వారిలో కదలిక, మాట, అలవాట్లు, నడక, నడత మారుతుంటాయి. కానీ కొందరు చిన్నారుల్లో ఇలాంటివేమీ ఉండవు. ఎంత వయస్సు వచ్చినా వారు చిన్నపిల్లల్లాగే వ్యవహరిస్తుంటారు. ఇలాంటి పిల్లలకు వచ్చిన ఆరోగ్య రుగ్మతనే వైద్య పరిభాషలో ఆటిజం అని వ్యవహరిస్తారు. ఇలాంటి పిల్లలకు చికిత్స, శిక్షణ ఇచ్చేందుకు ఇటీవల కేంద్రాలు పెరిగాయి. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వైద్య కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ నెల 2వ తేదీన జాతీయ ఆటిజం దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

వయస్సుకు తగ్గట్లు పిల్లల్లో మానసిక ఎదుగుదల లేకపోవడాన్నే ఆటిజం అంటారు. ఇది ప్రధానంగా పిల్లలపై ప్రభావం చూపుతుంది. ఇతరులతో పరస్పర సంబంధం, కమ్యూనికేషన్‌లో తీవ్రమైన లోపం ఉండటం దీని ప్రధాన లక్షణం. గత 15 సంవత్సరాల్లో ఆటిజం ప్రాబల్యత పెరుగుతోంది. 15 ఏళ్ల క్రితం ప్రతి 150 మంది పిల్లల్లో ఒకరిలో మాత్రమే ఆటిజం కనిపించేది. ప్రస్తుతం ప్రతి 30 మంది పిల్లల్లో ఒకరికి ఈ వ్యాధి ఉన్నట్లు వైద్యులు గుర్తిస్తున్నారు. ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, అంగీకారం, బాలల వికాస కేంద్రాలు అందుబాటులో ఉండటం వల్ల ఈ కేసులను త్వరగా గుర్తిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని బాలల సత్వర చికిత్స కేంద్రం/డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డైస్)లో ఆటిజం పిల్లలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ చిన్నారులకు వైద్య చికిత్సతో పాటు బిహేవియర్ థెరపీ, స్పీచ్‌థెరపీ అందిస్తూ సాధారణ స్థితికి తెచ్చేలా కృషి చేస్తున్నారు. ఇక్కడ 2020–21 నుంచి 2024–25 వరకు 52 మంది ఆటిజం పిల్లలకు చికిత్స అందించారు.

ఆటిజం లక్షణాలు

మాట్లాడటంలో ఇబ్బంది, స్నేహితులను కలిగి ఉండలేకపోవడం, గుంపులో ఆటలలో పాల్గొనలేకపోవడం, బొమ్మలను పంచుకోవడంలో ఆసక్తి లేకపోవడం, కళ్లలోకి నేరుగా చూడలేకపోవడం, చేతి సంకేతాల ద్వారా కమ్యూనికేట్ చేయడంలో అంతరాయం, అదేపనిగా దూకడం, బొమ్మలను వరుసగా అమర్చడం, ఒకే పనిపై ఆసక్తి ఉండటం–ఆహారం లేదా ఆటలో మార్పు వస్తే అసహనం చెందడం, పదే పదే ఒక దానిని తాకడం లేదా వాసన చూడటం ఆటిజం లక్షణాలు. అయితే ప్రతి పిల్లాడిలో ఈ లక్షణాలన్నీ ఉండకపోవచ్చు.

ఆటిజం అనుమానం ఉంటే ఏమి చేయాలి

పిల్లల్లో ఆటిజం ఉందన్న అనుమానం ఉంటే ఆ పిల్లలను సమగ్ర బాల వికాస కేంద్రానికి తీసుకెళ్లాలి. అక్కడ నిపుణుల బృందం పరిశీలిస్తారు. శిశు వైద్య నిపుణులు, బాల నాడీ వైద్యులు (పీడియాట్రిక్ న్యూరాలజిస్టు), శారీరక థెరపిస్ట్ (ఆక్యుపేషనల్ థెరపిస్ట్), క్లినికల్ సైకాలజిస్టు, మాటల అభివృద్ధి నిపుణులు (స్పీచ్‌థెరపిస్ట్) ద్వారా చికిత్స అందిస్తారు. అవసరమైతే ఎంఆర్ఐ స్కాన్, మెటబాలిక్ టెస్టింగ్, జన్యుపరమైన పరీక్షలు సూచిస్తారు.

ఆటిజం ఎందుకు వస్తుందంటే...

ఆటిజం ఎందుకు వస్తుందంటే ఇప్పటికీ స్పష్టమైన కారణం తెలియదు. అయితే కొన్ని కారణాలు ఆటిజానికి దారితీసే అవకాశం ఉంది. జన్యుపరమైన పరిస్థితులు, మారుతున్న పర్యావరణ పరిస్థితులు, మూర్ఛవ్యాధి (ఎపిలెప్సీ), ముందస్తు ప్రసవం, గర్భధారణ సమయంలో తల్లిదండ్రుల అధిక వయస్సు, ఆటిజంతో సంబంధం ఉన్న ఇతర సమస్యలు, 20 శాతం పిల్లలకు మూర్ఛ వచ్చే అవకాశం, నిద్ర సమస్యలు, ఆగ్రహావేశం, అధిక ఉత్సాహం(హైపర్ యాక్టివిటీ), మానసిక మూడ్ డిజార్డర్స్, ఆందోళన, భాషాభివృద్ధిలో జాప్యం, సామాజిక సంకేతాలను అర్థం చేసుకోవడంలో లోపం కారణంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు (ప్రమాదవశాత్తూ గాయాలు, నీటిలో మునిగిపోవడం)



ఆటిజం బాలుడు (ప్రతీకాత్మక చిత్రం)

తల్లిదండ్రుల శిక్షణే కీలకం



ప్రాథమికంగా ప్రవర్తనా చికిత్స (బిహేవియర్ థెరపీ) అందించాలి. 50 శాతం పిల్లలకు సంబంధిత ప్రవర్తనా సమస్యల నియంత్రణ కోసం మందులు అవసరం అవుతాయి. ఆటిజం పిల్లలకు వైద్యుల సూచన మేరకు ఇంటి వద్ద తల్లిదండ్రులు అవసరమైన శిక్షణ ఇవ్వాలి. వారానికి 30–40 గంటలు ఈ శిక్షణ అందించాలి. తాజా అధ్యయనాల ప్రకారం మూడేళ్లలోపు ఆటిజం ఉన్నట్లు గుర్తించి చికిత్స ప్రారంభిస్తే 10 శాతంపైగా పిల్లలు పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ శ్వేతా రాంపల్లి, పీడియాట్రిక్ న్యూరాలజిస్టు, కర్నూలు

డైస్‌లో ఆటిజం పిల్లలకు ఉచిత శిక్షణ



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని బాలల సత్వర చికిత్స కేంద్రం (డైస్)లో ఆటిజం పిల్లలకు చిన్నపిల్లల వైద్యులచే చికిత్స, వారికి అవసరమైన స్పీచ్‌థెరపీ, ప్లే థెరపీ ఇస్తారు. ప్లే థెరపీలో భాగంగా చిన్న చిన్న ఫజిల్స్ సెట్‌చేయడం, వారి పనులు వారే చేసుకునేలా శిక్షణ ఇస్తారు. వారికి నడక నేర్పిస్తారు. నేరుగా చూసి మాట్లాడటం అలవాటు చేస్తారు. ఆటిజంతో ఇక్కడికి 10 నుంచి 12 మంది చికిత్సకు వస్తుంటారు. ఇక్కడ ఇచ్చే శిక్షణ వల్ల ఆటిజం సమస్య పెరగకుండా ఆపుతుంది. డైస్ ఫోన్ నెం.08518–251043.

–షేక్ మహ్మద్ ఇర్ఫాన్, బాలల సత్వర చికిత్స కేంద్రం, మేనేజర్

5న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు అండర్–23, అలాగే సీనియర్స్ విభాగంలో క్రికెట్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేరుగా ఎంపిక పోటీలకు హాజరు కావొచ్చన్నారు. అండర్ – 23 విభాగంలో పాల్గొనేందుకు 2002 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని వెల్లడించారు.

లక్ష్యాన్ని అధిగమించిన కర్నూలు మార్కెట్ కమిటీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ 2024–25 సంవత్సరానికి సంబంధించి ఫీజు వసూలులో లక్ష్యాన్ని అధిగమించినట్లుగా సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా ఒక్క శాతం రూపంలో కర్నూలు మార్కెట్ కమిటీ ద్వారా రూ.7.60 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా వాటిని అధిగమించి రూ.8.40 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఫీజు వసూలులో లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేసిన కమిటీ సిబ్బందిని సెక్రటరీ అభినందించారు.

కానిస్టేబుల్‌పై సీఐకు ఫిర్యాదు

కర్నూలు: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ వెంగన్న తన పట్ల దురుసుగా ప్రవర్తించి లాఠీతో కొట్టాడని కల్లూరు ఇందిరమ్మ కట్ట వద్ద నివాసముంటున్న పంచాయతీ సెక్రటరీ గోవిందు కుమారుడు బీటెక్ విద్యార్థి అరవింద్ నాలుగో పట్టణ సీఐకి ఫిర్యాదు చేశాడు. ఉగాది పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి కొత్తబస్టాండ్ వెనుక వైపు నుంచి ఇందిరమ్మ కట్ట వద్ద ఉన్న తన ఇంటికి వెళ్తుండగా వైన్‌షాప్ దగ్గర విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వెంగన్న తనను అడ్డగించి అటువైపు వెళ్లడానికి వీల్లేదంటూ వారించి లాఠీతో చావబాదాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కానిస్టేబుల్ కొట్టడం వల్ల తన ఎడమ చెయ్యికి గాయమైందని, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కూడా చేయించుకున్నట్లు వాపోయారు. లాఠీతో కొట్టి చెయ్యి ఫ్రాక్చర్‌కు కారణమైన కానిస్టేబుల్ వెంగన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



సి.బెళగల్ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

సి.బెళగల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు మంగళవారం సోషల్ పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొత్తకోటలో ఐదుగురు, ఏపీ మోడల్ స్కూల్లో నలుగురు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో ముగ్గురు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులు రఘురామిరెడ్డి, వంశీమోహన్, మల్లయ్య, బలరాముడు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి ఆయా పరీక్షల కేంద్రాల దగ్గర పోలీస్ బందోబస్తును నిర్వహించి, నాలుగు పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. కాగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ రాణెమ్మ, ఎంఈఓ జ్యోతి తనిఖీ చేశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంతో ఇంటి ముఖం పట్టారు.

ఆరుగురు గైర్హాజర్

ఓర్వకల్లు: ఈ ఏడాది మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. గత 14 రోజుల పాటు విద్యార్థులు ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి విద్యార్థులు పరీక్షలు రాశారు. చివరి రోజున వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొత్తం 921 మంది విద్యార్థులకు గాను 915 మంది విద్యార్థులు సోషల్ పరీక్షకు హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యా శాఖాధికారులు తెలిపారు.

అందరినీ చల్లగా చూడు తల్లీ



గడివేముల మూలపెద్దమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా మూల పెద్దమ్మను మొక్కుకున్నట్లు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చెప్పారు. గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ జాతర సందర్భంగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఈఓ రామలింగారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఆకుపూజ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే కాటసానిని ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదాలు అందించారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మూలపెద్దమ్మ ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ కన్వీనర్ మధుసూదన గుప్త, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఉసేన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ చిన్నన్న, చంద్రమౌళీశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి, పుల్లయ్య, గనిప్రతాపరెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

అలా మొదలైంది!

- ఇంటర్ సెకండియర్ తరగతులు ప్రారంభం
- తెరుచుకోని తరగతి గదులు...
- ప్రభుత్వ నిర్ణయంపై మండిపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



కోడుమూరులో విద్యార్థులు రాకపోవడంతో తెరుచుకోని జూనియర్ కళాశాల తరగతి గదులు

కోడుమూరు రూరల్: రెండు నెలలు ముందుగానే ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం జూన్‌లో తెరవాల్సిన జూనియర్ కళాశాలు మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యా విధానంలో మార్పులంటూ మంగళవారం నుంచి సెకండియర్ తరగతులను ప్రారంభించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయాన్నే కళాశాలలను అధ్యాపక సిబ్బంది తెరచివుంచగా, విద్యార్థులెవ్వరూ క్లాసులకు హాజరు కాలేదు. కోడుమూరు, గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఒక్క విద్యార్థి కూడా హాజరు కాలేదు. దీంతో విద్యార్థులకు క్లాసులు చెప్పేందుకు వచ్చిన లెక్చరర్లు ఖాళీగా స్టాఫ్ రూముల్లో కూర్చోవాల్సి దాపురించింది. కాగా ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. వేసవి సెలవుల్లోనూ ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు యథేచ్ఛగా తరగతులను నిర్వహించుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందంటూ ఆరోపించారు. ఎన్నడూ లేని విధంగా మండే వేసవిలో విద్యార్థులకు ఎలా తరగతులను నిర్వహిస్తారని, ఇకనైనా ప్రభుత్వం మరోసారి తన నిర్ణయాన్ని పునర్ సమీక్షించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

61 మందికి ఇద్దరు హాజరు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన 61 మంది విద్యార్థులు ఇటీవల పరీక్షలు రాశారు. వీరు మంగళవారం ప్రారంభమైన ఇంటర్ సెకండియర్ తరగతులకు హాజరు కావాల్సి ఉంది. అయితే బైపీసీకి చెందిన ద్రాక్షాయణి, ఎస్తేరు అనే ఇద్దరు విద్యార్థినులు మాత్రమే హాజరయ్యారు. స్థానిక కస్తూర్బాలో 25 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తి చేసుకోగా, మొదటి రోజు కేవలం లతావాణి అనే బైపీసీ విద్యార్థిని హాజరైంది. కాగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 68 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తి చేసుకోగా, మొదటిరోజు ఒక్కరూ కూడా రాలేదు. పరీక్షలు అయిన 15 రోజులలోగా సెకండ్ ఇయర్ తరగతులను నిర్వహించడంపై విద్యార్థులు ఆసక్తి చూపడంలేదని అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.



సి.బెళగల్ మోడల్ స్కూల్‌లో హాజరైన ఇద్దరు విద్యార్థినులు

అయిష్టంగానే..

పాణ్యం: స్థానిక ఏపీ మోడల్ కళాశాలలో 48 మంది విద్యార్థులకు గాను 21 మంది హాజరైయ్యారు. అలాగే పాణ్యం జూనియర్ కళాశాలలో దాదాపుగా 150 ఉండగా కేవలం 80 మంది హాజరైయ్యారు. పాణ్యంలో కళాశాలో ఆవరణంలో పదవ తరగతి పరీక్షల కారణంగా విద్యార్థులు మధ్యాహ్నం నుంచి హాజరయ్యారు. పరీక్ష ముగిసిన వెంటనే తరగతులు పునఃప్రారంభంచడం సరికాదని కొంత మంది విద్యార్థులు మండిపడ్డారు.

కార్యాలయాల్లోనే పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న కల్లూరు ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

సి.బెళగల్/కల్లూరు : సి.బెళగల్ మండలంలో పింఛన్ పొందేందుకు లబ్ధిదారులు అవస్థలు పడ్డారు. మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి కొంత మంది సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేపట్టగా, మరి కొంతమంది మాత్రం తమకేమి పట్టదన్నట్లుగా కార్యాలాయల్లోని ఉండి లబ్ధిదారులను వారు ఉన్నచోటుకే పిలుపించుకుని పింఛన్ డబ్బులు అందజేశారు. మండల కేంద్రం సి.బెళగల్లోని ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి లబ్ధిదారులకు ఇళ్ల దగ్గక కాకుండా మహిళా కానిస్టేబుల్ షహనాజ్, సర్పంచ్ పాండురంగన్నతో కలిసి గ్రామ సచివాలయం – 1లో పింఛన్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వివిధ గ్రామాల్లో సైతం ఉద్యోగులు పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లకుండా సచివాలయాల్లో, వీధి చివర, ఆలయాల పరిసరల్లో, అరుగుల దగ్గరకు పిలుపించుకుని పింఛన్ పంపిణీ చేపట్టారు. కాగా ఈ నెలలో 7,067 మంది లబ్ధిదారులు ఉండగా, 6,495 మందికి పింఛన్ పంపిణీతో దాదాపు 92 శాతం నమోదైంది. కల్లూరు మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి తెలిపారు. పింఛన్ల పంపిణీని ఆయన పర్యవేక్షించారు. కె.మార్కాపురం, పెద్దకొట్టాల గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

కర్నూలు (సిటీ): దేశవ్యాప్తంగా ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు నేటి నుంచి జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. బీటెక్‌లో ప్రవేశానికి పేపర్–1 పరీక్ష, బీఆర్క్, బీప్లానింగ్ సీట్ల భర్తీకి పేపర్–2 పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరగనున్నాయి. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని అయాన్ డిజిటల్ కేంద్రంలో నిర్వహించనున్న పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రికల్ వస్తువులు వెంట తెచ్చుకోకూడదు. జిల్లాలో జేఈఈ పరీక్షకు సుమారుగా 1600 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. నేడు, రేపు, 4, 7, 8 తేదీల్లో పేపర్ – 1, 9వ తేదీన పేపర్ – 2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ముగిసిన తర్వాత.. మొదటి విడతలో వచ్చిన స్కోరు, ప్రస్తుతం నిర్వహిస్తున్న తుది విడత పరీక్ష స్కోరును పరిగణలోకి తీసుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈనెల 17 లేదా ఆలోపు జేఈఈ మెయిన్స్ ర్యాంకులను ప్రకటించనుంది.

చిన్నారుల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్: ఆటిజం చిన్నారుల పెంపకంపై తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం కోడుమూరు పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటిజంను ఆరంభదశలో గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని, మందబుద్ధి పిల్లలు మాట్లాడకపోవడం, కారణం లేకుండా ఏడవడం, పేరు పెట్టి పిలిచినా పలకక పోవడం, ఎవ్వరితో కలవకపోవడం వంటి తదితర లక్షణాలు కన్పిస్తే వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి సత్వర చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీమంత్ మాదన్న, నర్మదా, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్ ఉమాబాయి పాల్గొన్నారు.

కరువు మండలాలు కనిపించలేదా?

కర్నూలు(సెంట్రల్): కరువు బారిన పడిన మండలాలను కప్పి పుచ్చి జాబితాను విడుదల చేశారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. జిల్లాలో హొళగుంద, హాలహర్వి, ఆలూరు, పెద్దకడబూరు, సి.బెళగల్, దేవనకొండ, తుగ్గలి మండలాల్లో నీటి లభ్యత లేక రైతులు వేసిన పంటలు దెబ్బతిని అప్పుల పాలయ్యారన్నారు. అయినా వాటిని కరువు మండలాలుగా ప్రకటించకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం కరువు మండలాలుగా ప్రకటించిన ఆస్పరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి, పత్తికొండ మండలాలతో పాటు మిగిలిన 16 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.



ఎల్లమ్మకు పోటెత్తిన భక్తులు

నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి గుగ్గిళ్లు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. – కర్నూలు(రూరల్)





కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనాలు



చెత్తచెదారాలతో నిండిన దృశ్యం

శిథిల భవనాలు

స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణంలోని ఎంపీపీ స్కూల్ భవనానికి చెందిన గదులు శిథిలావస్థకు చేరి భయపెడుతున్నాయి. కొత్త గదులు నిర్మించడంతో పాఠశాల ఆవరణంలోని పాత గదులు పాడుబడ్డాయి. ముళ్లపొదలతో పాటు చెత్తచెదారాలు నిండిపోవడంతో విషపురుగులు తిరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. శిథిలమైన భవనాలు తొలగించి విద్యార్థులు ఆడుకోవడానికి మైదానంగా మార్చాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు. – గడివేముల